సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 19 । ఆగస్టు । 2023



చెదరని జ్ఞాపకం

ఒక్క ఫొటో ఎన్నో మధురజ్ఞాపకాలు కళ్ల ముందు కదలాడేలా చేస్తుంది. కాలాన్ని వెనక్కి తీసుకెళ్లి ఎన్నో ఏళ్ల కిందటి స్మృతులను పంచుతుంది. 8లో▸

32 మందికి 'కారుణ్య' ఉద్యోగాలు

కైలాస్‌నగర్: కారుణ్య నియామక పోస్టుల భర్తీ కోసం శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 34 మంది దరఖాస్తు చేసుకోగా 32 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్లు పరిశీలించాక అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు కల్పిస్తూ ఆర్డర్లు అందజేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
26.0 /23.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో 2023–24 సంవత్సరంలో మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీవీటీ పాట్రన్ కింద ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శనివారం నుంచి ఈనెల 30 వరకు https:// iti. telangana. gov. inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు 10వ తరగతి లేదా ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. 1.8.2023 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలని, గరిష్ఠ వయస్సు లేదని తెలిపారు. దరఖాస్తు సమయంలో వెబ్‌సైట్‌లో ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్, క్యాస్ట్, బోనాఫైడ్ (4వ నుంచి 10వరకు) లేని పక్షంలో నివాస ధ్రువీకరణ పత్రం, ఎడ్యుకేషన్‌కు సంబంధించి చివరి టీసీ, రీసెంట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9493535378 నంబర్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించాలని సూచించారు.

నేడు 5కే రన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' అంశంపై అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం 6 గంటలకు 5కే రన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రన్‌లో జిల్లాలోని యువతీయువకులు, మహిళలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా అటవీశాఖ అధికారి పీ రాజశేఖర్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే ఓ ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు రాజీ మార్గం ద్వారా ఎక్సైజ్, భూ తగాదాలు, కుటుంబ కలహాలు, బ్యాంక్ రుణాల రికవరీ, చిట్‌ఫండ్ తదితర కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు.

పల్లె దవాఖాన పరిశీలన



దవాఖానలో వివరాలు తెలుసుకుంటున్న బృందం సభ్యులు

తాంసి: భీంపూర్ మండలం ధనోరా పల్లె దవాఖానను శుక్రవారం ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ) బృందం సభ్యులు పరిశీలించారు. ఢిల్లీకి చెందిన ఎన్‌క్వాస్ సభ్యులు డాక్టర్ వైశాలి, ఆనంది బిక్షిత్ తనిఖీ చేసి వైద్యసేవలపై ఆరా తీశారు. దవాఖాన పరిసరాలు, పరిశుభ్రతను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వారి వెంట జిల్లా మాతా శిశుసంరక్షణాధికారి విజయసారథి, భీంపూర్ వైద్యాధికారి నిఖిల్‌రాజ్, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ అమర్‌నాథ్, హెచ్ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారులు సత్తా చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్: జిల్లాలో ప్రతిభగల క్రీడాకారులకు కొదవలేదని, పోటీల్లో సత్తా చాటుతూ జిల్లాకు పేరు తేవాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, కోచ్ రాకేశ్, విఠల్‌రెడ్డి తదితరులున్నారు.

మస్తు దరఖాస్తులు

- 40 వైన్‌షాపులకు 975 దరఖాస్తులు
- గతం కంటే రెట్టింపునకు చేరువలో..
- సర్కార్‌కు రూ.19.50కోట్ల ఆదాయం
- మహిళల పేర్లపై భారీగా దరఖాస్తులు
- ఈనెల 21న రత్న గార్డెన్స్‌లో లక్కీడ్రా



క్యూలో నిల్చుని దరఖాస్తులు అందజేస్తున్న వ్యాపారులు

అధిక దరఖాస్తులు వచ్చిన షాపులు..

షాప్ నంబర్	పట్టణంలోని వార్డు	దరఖాస్తుల సంఖ్య
8	టీచర్స్ కాలనీ	83
4	వినాయక్‌చౌక్	79
5	తెలంగాణచౌక్	76
6	విద్యానగర్ (రవితేజ హోటల్ సమీపంలో)	57
9	దస్నాపూర్	56
7	విద్యానగర్ (బస్టాండ్ లైన్‌లో)	56
1	మహాలక్ష్మీవాడ (తిర్పెల్లి)	33
19	బోథ్	33
29	గిర్నూర్	32
20	బోథ్	31
2	పంజాబ్‌చౌక్	26
3	పంజాబ్‌చౌక్	25

సాక్షి, ఆదిలాబాద్: ఎక్సైజ్ టెండర్ల దరఖాస్తు గడువు ముగిసింది. 2021–23లో కంటే 2023–25 మద్యం పాలసీలో దరఖాస్తులు అధికంగా వచ్చాయి. శుక్రవారం రాత్రి 7గంటల వరకు అందిన సమాచారం మేరకు టెండర్ల ద్వారా సర్కార్‌కు రూ.19.50 కోట్ల ఆదాయం లభించింది. గతేడాది కంటే ఇది రూ.6.98 కోట్లు అదనం. చివరిరోజు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. మహిళల పేర్లపై పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని రత్న గార్డెన్స్‌లో ఈనెల 21న కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యవేక్షణలో డీపీఈవో హిమశ్రీ ఆధ్వర్యంలో లక్కీడ్రా తీసి షాపులు కేటాయించనున్నారు.

20 కంటే తక్కువ దరఖాస్తులు వచ్చినవి..

ఈ టెండర్లలో 21 వైన్‌షాపులకు 20 కంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులు తక్కువ వచ్చిన చోట రీటెండర్ నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ఈ నేపథ్యంలో వీటికి తిరిగి టెండర్లు నిర్వహిస్తారా? లేదా? అనేది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. ఆదిలాబాద్ ఎక్సైజ్ డివిజన్‌లో ఏడు షాపులు, ఇచ్చోడ ఎక్సైజ్ డివిజన్‌లో ఏడు, ఉట్నూర్ ఎక్సైజ్ డివిజన్‌లో ఏకంగా ఎనిమిది షాపులకు 20 కంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. ఉట్నూర్ ఎక్సైజ్ డివిజన్‌లో తొమ్మిది షాపులుండగా ఇందులో ఎనిమిదింటికి తక్కువ దరఖాస్తులు రావడం గమనార్హం.

మహిళల నుంచి కూడా..

ఎక్సైజ్ టెండర్లలో మహిళలు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎంతమంది మహిళల పేరు మీదుగా దరఖాస్తులు వచ్చాయనేది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. పలువురు దరఖాస్తుదారులు సెంటిమెంట్‌గా తమ కుటుంబంలోని మహిళల పేరిట దరఖాస్తు చేసుకున్నారు. గతంలో వైన్‌షాప్ నిర్వహించిన వారు ఈ టెండర్లలో పలు షాపులకు దరఖాస్తులు అందించారు.

చివరిరోజే అధికం..

నూతన ఎక్సైజ్ పాలసీకి సంబంధించి ఈనెల 4న నోటిఫికేషన్ జారీ అయింది. ఆరోజు నుంచి శుక్రవారం వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా ఎక్సైజ్ అధికారి (డీపీఈవో) కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. డీపీఈవో హిమశ్రీ, ఆదిలాబాద్ సీఐ శ్రీనివాస్ సమక్షంలో ప్రక్రియ కొనసాగింది. గురువారం వరకు జిల్లాలోని 40 షాపులకు 481 దరఖాస్తులే వచ్చాయి. చివరిరోజు ఏకంగా 494 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని మొత్తం షాపుల సంఖ్య ప్రకారం దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటే సగటున ఒక్కో షాపునకు 24 దరఖాస్తుల చొప్పున వచ్చాయి. చివరిరోజు దరఖాస్తులు భారీగా వస్తాయని ఊహించిన ఎక్సైజ్ అధికారులు ముందుగానే అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు.



దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన మహిళలు

2021లో వచ్చిన దరఖాస్తులు, ఆదాయం

మొత్తం షాపులు:	40
మొత్తం దరఖాస్తులు:	617
ఆదాయం:	రూ.12.34 కోట్లు

2023లో వచ్చిన దరఖాస్తులు, ఆదాయం

మొత్తం షాపులు:	40
చివరిరోజు దరఖాస్తులు:	494
మొత్తం దరఖాస్తులు:	975
ఆదాయం:	రూ.19.50కోట్లు

స్టేషన్ల వారీగా దరఖాస్తులు

ఎక్సైజ్ స్టేషన్	షాపుల సంఖ్య	వచ్చిన దరఖాస్తులు
ఆదిలాబాద్	18	628
ఇచ్చోడ	13	219
ఉట్నూర్	09	128

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

కైలాస్‌నగర్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ ప్రభుత్వ పథకాలపై సమీక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవ, వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా ఈ నెల 26న జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా స్థలాలను గుర్తించడంతో పాటు గుంతల తవ్వకం చేపట్టాలన్నారు. జిల్లాలో సంపద వనాలు, తెలంగాణకు హరితహారం లక్ష్యాలను ఆగస్టు 26నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ వారం 100 గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, గొర్రెల కొనుగోలు, లబ్ధిదారులకు పంపిణీ, గొర్రెలకు బీమా సౌకర్యం పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. బీసీ కుల వృత్తుల ఆర్థిక సాయానికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. 154 మంది మైనారిటీ లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించేందుకు శనివారంలోగా జాబితాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ ప్రక్రియకు సంబంధించి జిల్లా కమిటీ స్క్రూటినీ పూర్తి చేసి పత్రాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా అటవీ అధికారి రాజశేఖర్, డీఆర్వీవో కిషన్, మున్సిపల్ కమిషనర్ శైలజ, గృహ నిర్మాణశాఖ నోడల్ అధికారి బసవేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

23మంది డిబార్

ఎదులాపురం: దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న కాకతీయ ఎస్‌డీఎల్‌సీ పరీక్షల్లో శుక్రవారం 23మంది డిబారైనట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 సెంటర్లలో శుక్రవారం పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. 3,900 మంది విద్యార్థులకు 3,021 మంది హాజరు కాగా, 879 గైర్హాజరైనట్లు వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సైన్స్) ఆదిలాబాద్‌లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ 23మంది డిబారైనట్లు పేర్కొన్నారు.

స్వరాష్ట్రంలో మహనీయులకు గుర్తింపు



సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రామన్న

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి
- బస్టాండ్ ఎదుట విగ్రహావిష్కరణ

కైలాస్‌నగర్: స్వరాష్ట్రంలో మహనీయులకు ప్రత్యేక గుర్తింపు దక్కుతోందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి పాపన్నగౌడ్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాపన్నగౌడ్ సేవలను కొనియాడారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి కే రాజలింగు, వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు పట్టణంలోని ఇందిరానగర్ నుంచి సర్వాయి పాపన్న విగ్రహంతో శోభాయాత్రగా బస్టాండ్‌కు చేరుకున్నారు. గౌడ కులస్తులు డీజే పాటలపై నృత్యాలు చేశారు. అనంతరం తనీషా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ సేవలను కొనియాడారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటు కమిటీ అధ్యక్షుడు భూమాగౌడ్, ఉపాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ రాజేశ్వర్‌గౌడ్, కోశాధికారి సాయి చైతన్యగౌడ్, సభ్యులు దినేశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్, సాయిచరణ్‌గౌడ్, ప్రణయ్‌గౌడ్, ధర్మరాజుగౌడ్, సర్వాయి పాపన్న యువజన సంఘం నాయకులు గజానంద్ గౌడ్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'డివిజన్' దీక్ష

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని చేపట్టిన దీక్ష శుక్రవారం 33వ రోజుకు చేరింది. దీక్ష శిబిరంలో ఫ్రెండ్స్ రాక్స్ యూత్ సభ్యులు కూర్చున్నారు. వీరికి పలువురు నేతలు, కుల సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లోపు బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బోథ్ సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు.



దీక్షలో కూర్చున్న ఫ్రెండ్స్‌రాక్స్ యూత్ సభ్యులు

గృహ 'లక్ష్మీ'కటాక్షం ఎవరికో..!

- జిల్లాలో అందిన దరఖాస్తులు 66,914
- ఈ నెల 20తో ముగియనున్న పరిశీలన
- నిర్ణీత గడువులోపు సర్వే అనుమానమే

కైలాస్‌నగర్: పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. సొంత స్థలం కలిగిన వారు ఇల్లు నిర్మించుకుంటే ఈ పథకం కింద రూ.3లక్షల ఆర్థికసాయాన్ని అందజేయాలని నిర్ణయించింది. నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా 66,914 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హుల గుర్తింపునకు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నారు. పరిశీలన గడువు ఈ నెల 20వ తేదీతో ముగియనుండగా సర్వే పూర్తవడం అనుమానంగానే కన్పిస్తోంది.



తాంసి మండలం పొన్నారిలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు	పరిశీలించినవి	అర్హులు
ఆదిలాబాద్‌అర్బన్	7,021	2,233	1,627
ఆదిలాబాద్‌రూరల్	4,110	2,446	1,908
జైనథ్	5,826	2,032	1,284
బేల	5,116	2,127	1,494
మావల	2,939	298	–
బోథ్	5,857	2,063	1,670
ఇచ్చోడ	4,259	1,613	149
నేరడిగొండ	4,023	1,994	1,422
గుడిహత్నూర్	2,624	641	447
బజార్‌హత్నూర్	3,544	1,978	1,680
సిరికొండ	2,203	748	666
తాంసి	2,016	650	543
తలమడుగు	2,509	1,583	169
భీంపూర్	2,658	1,170	1,105
నార్నూర్	2,328	552	531
గాదిగూడ	1,920	575	503
ఉట్నూర్	5,308	2,056	1,698
ఇంద్రవెల్లి	2,653	1,456	960

వెల్లువెత్తిన దరఖాస్తులు

గృహలక్ష్మి కోసం ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఇందుకోసం మండలాల్లో తహసీల్, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇంటి స్థలం కలిగిన 66,914 మంది దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గానికి 3వేల ఇళ్ల చొప్పున మంజూరు కానుండగా, ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి 25,012, బోథ్ నియోజకవర్గం నుంచి 29,693 దరఖాస్తులు రావడం గమనార్హం. అలాగే ఖానాపూర్ నియోజకవర్గంలోని రెండు మండలాలు, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని రెండు మండలాల్లో కలిపి 1,400 ఇళ్లకు 12,209 దరఖాస్తులు అందడం గమనిస్తే ఇప్పటికీ పక్కా ఇళ్లు లేని నిరుపేదలెంతమంది ఉన్నారనే విషయం స్పష్టమవుతోంది.

దళారుల చెంతకు దరఖాస్తుదారులు

తొలి విడతలో ఒక్కో నియోజకవర్గంలోని 3వేల మందికి మాత్రమే ఆర్థికసాయం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడం, దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఎలాగైనా తమ పేరు తొలి జాబితాలో ఉండాలని దరఖాస్తుదారులు ఆశపడుతున్నారు. ఇందుకోసం దళారులు, తెలిసిన రాజకీయ నాయకులను ఆశ్రయిస్తూ వేడుకుంటున్నారు. కొంతమంది అక్రమార్కులు ఇదే అదనుగా భావించి దరఖాస్తుదారుల నుంచి అందినకాడికి దండుకునే ప్రయత్నం చేస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభం

ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లోని వార్డుల వారీగా మున్సిపల్ సిబ్బంది అర్హుల గుర్తింపునకు సర్వే చేపడుతున్నారు. దరఖాస్తుదారులకు సొంత స్థలం, ఆహారభద్రత కార్డు, ఆధార్‌కార్డులు ఉన్నాయా? అనే వివరాలు ఆరా తీస్తున్నారు. సర్వే గడువు ఈ నెల 20వ తేదీతో ముగియనుంది. దీంతో నిర్ణీత గడువులోపు సర్వే పూర్తవడం అనుమానంగానే కనిపిస్తోంది. గడిచిన తొమ్మిది రోజుల్లో 26,215 దరఖాస్తులు మాత్రమే పరిశీలించారు. ఇందులో 17,854 మందిని అర్హులుగా తేల్చారు. ఇంకా 44,699 దరఖాస్తులు పరిశీలించాల్సి ఉన్నందున అర్హుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో గృహలక్ష్మి యోగం ఎవరికి దక్కుతుందోననే ఆందోళన లబ్ధిదారుల్లో ఉంది.

సీపీఎఫ్ సేవలు అభినందనీయం

ఉట్నూర్‌రూరల్: సీపీఎఫ్ సేవలు అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో సీపీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొన్న పీవోకు ఆదివాసీ మహిళా రైతులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం పీవో మాట్లాడుతూ.. ఆదివాసీ రైతుల అభ్యున్నతికి సీపీఎఫ్ ద్వారా జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టనున్న పనులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్‌రావు, వివిధ శాఖల అధికారులు, సంస్థ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్

క్లుప్తంగా

ఉస్మానియాలో డాక్టర్ రాజుకు సీటు


డాక్టర్ రాజు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాథోడ్ రాజు ఉస్మానియా కళాశాలలోని పల్మోనరిలో (శ్వాసకోశ వ్యాధి నిపుణులు) సీటు సాధించాడు. చిన్న బుగ్గారం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాథోడ్ గంభీర్ సింగ్- జయ దంపతుల కుమారుడు రాజు వెలువడిన పీజీ ఫలితాల్లో సీటు సాధించాడు. దీంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు.

గాయపడిన యువకుడి మృతి

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): బైక్ అదుపుతప్పి కిందపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు వివరాల ప్రకారం.. షేక్ ఆలమ్స్ అలియాస్ షేక్ సమీర్(17) ఈనెల 13న నిజామాబాద్‌లోని ఫ్రూట్ మార్కెట్ దగ్గరలోని హోటల్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని స్థానిక జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడు నిర్మల్ జిల్లా బాసరలోని శారదనగర్‌కు చెందినవాడని నాలుగేళ్లుగా నిజామాబాద్‌లో లేబర్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆరు గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామంలో బొడికెల శ్రీకాంత్‌కు చెందిన గొర్రెల కొట్టంలో ఆరు గొర్రెలు షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం మృతి చెందాయి. విద్యుత్‌శాఖ లైన్ ఇన్స్‌పెక్టర్ శివన్న, పశు వైద్యాధికారి గోవర్ధన్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. గొర్రెల విలువ రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

స్వగ్రామానికి మృతదేహం


రమేశ్(ఫైల్)

సారంగపూర్: మండలంలోని కొట్ల(బి) గ్రామానికి చెందిన బెజ్జారం రమేశ్(34) దుబాయి బీచ్‌లో ప్రమాదవశాత్తు పడి ఈ నెల 5న మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఆయన మృతదేహం శుక్రవారం స్వగ్రామమైన కొట్ల(బి)కి చేరుకుంది. సమాచారం తెలియగానే కుటుంబీకులు, బంధువులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అంతిమయాత్ర ప్రారంభించి దహన సంస్కారాలు పూర్తి చేశారు. మృతుడికి భార్య వనితతో పాటు సాత్విక్(10), రిత్విక్ (6) ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో ఆ కుటుంబం వీధినపడినట్లయింది. శవయాత్ర వెంబడి గ్రామస్తులు పెద్దమొత్తంలో తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

21న నాగోబా ఆలయంలో నాగుల పంచమి పూజలు


నాగోబా విగ్రహం

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఈ నెల 21న నాగుల పంచమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పూజలకు వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేస్లాపూర్ నాగోబా మినీ స్టేడియం వద్ద క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు నాగోబాను దర్శించుకోవాలని కోరారు.

చెదరని జ్ఞాపకం

- భావితరాలకు సంస్కృతిని తెలుపే సాధనం
- మనసులోని భావాలకు ప్రతిరూపమే దృశ్యం
- ఫొటోలు, సెల్ఫీలకు పెరుగుతున్న ప్రాధాన్యం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం..


రామ్‌శ్రీను తన కెమెరాలో బంధించిన నిర్మల్ జిల్లాలోని ప్రకృతి అందాలు


వాస్తాపూర్ జలపాతం వద్ద పర్యాటకుల సందడి - నిర్మల్ ఫొటోగ్రాఫర్


నిర్మల్ జిల్లాలోని మహబూబాబాద్ అందాలు - నిర్మల్ ఫొటోగ్రాఫర్


మోడువారి మైమరిపిస్తున్న వృక్షం
- బాతురి కైలాష్, సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


ప్రకృతి మాయాజాలానికి అద్దంపట్టే రెండు వర్ణాలతో కూడిన చెట్టు
- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


ప్రకృతివనంలో ముత్యంలాంటి దృశ్యం

కోనసీమ అందాలను తలపిస్తున్న నిర్మల్ జిల్లా లక్ష్మంపూర్ శివారు ప్రాంతం






నిక్షేప్ కెమెరాలో బంధించిన చిత్రాలు


శ్రీనివాస్ కెమెరాలో బంధించిన పక్షులు

నిర్మల్ ఖిల్లా: ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ ఫొటో చూడగానే వెనక్కి వెళ్లి ఏండ్ల కిందటి మధురస్మృతులు మనసులో మెదలుతాయి. సంతోషం.. బాధలు .. మధుర ఘట్టాలు .. సాధించిన విజయాలు.. అద్భుత సన్నివేశాలు .. కాలానుగుణంగా ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులను బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ చూసుకునే అవకాశం ఫొటోతోనే సాధ్యం. అందుకే మిత్రులు, కుటుంబ సభ్యులతో ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ ఓ ఫొటోనో, సెల్ఫీనో తీసుకోవడానికి ఉబలాటపడుతుంటారు. ఇన్ని అందమైన గుర్తులను మదిలో ముద్రించే ఈ ఫొటోగ్రఫీ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 19వ తేదీన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటారు.

అరచేతిలోనే కెమెరా...

గతంలో కెమెరా ఉంటేనే ఫొటోగ్రఫీ చేయడానికి అవకాశం ఉండేది. కానీ ప్రస్తుత కాలంలో స్మార్ట్ మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరి చేతిలో కెమెరాలు వచ్చేశాయి. ప్రతీ ఒక్కరు ఛాయా చిత్రాలను సేకరించడం భద్రపరచుకోవడం పరిపాటిగా మారింది. ఈ దశలో తమ సృజనాత్మకతకు పదును పెట్టేలా, వివిధ రకాలుగా తమ అభిరుచులకు అనుగుణంగా భిన్న కోణాల్లో ఫొటోలు తీస్తూ వీక్షకులకు అందుబాటులో పలు మాధ్యమాల్లో ఉంచుతున్నారు.

అలవాటు.. అద్భుతాలు


నిక్షేప్

ఆదిలాబాద్: చేసింది బీటెక్.. ఫొటోగ్రఫీ హాబీ... అయితేనేం.. ఆ యువకుడు క్లిక్ మనిపిస్తే ఓ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ తీసినంత అందంగా ఉంటాయి ఆ చిత్రాలు.. ఎన్నో అద్భుతాలను తన కెమెరాలో బంధించి వావ్ అనిపిస్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన జే.శ్రీనివాస్, అర్చన దంపతుల కుమారుడు జంగిల్‌వార్ నిక్షేప్ యాదవ్ చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీపై మక్కువ.

భావితరాలకు అందించేందుకు..



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ధోండి శ్రీనివాస్. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఇతడికి ఫొటోగ్రఫీ, వీడియో చిత్రీకరణ అంటే అమితమైన ఇష్టం. వీరు సంస్కృతి సంప్రదాయాలు, చారిత్రాత్మక ప్రాంతాలు, జాతరలు పండగలు వంటి వాటిని ఫొటోలు, వీడియోల రూపంలో చిత్రీకరిస్తూ తన అభిరుచిని ప్రదర్శిస్తున్నాడు. ఇప్పటి వరకు జిల్లాలోని అనేక చారిత్రక కోటలు, పల్లె ప్రాంతాలు, స్థానిక సంప్రదాయ జాతరలను ఫొటోలు, వీడియోలుగా మలిచి పలు సామాజిక మాధ్యమాల్లో నిక్షిప్తం చేస్తున్నాడు. ఇప్పటివరకు వందలాది ఛాయా చిత్రాలు, వీడియోలను చిత్రీకరించి వాటిని సామాజిక మాధ్యమం ద్వారా వీక్షకులకు అందుబాటులో ఉంచుతున్నాడు.

నాకున్న అభిరుచే వృత్తిగా మారింది



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రామ్ శ్రీను, జిల్లా కేంద్రానికి చెందిన ఇతడికి ఫొటోగ్రఫీ అనేది అతడి జీవన విధానంలో భాగమైంది. వృత్తిపరంగా, అభిరుచి పరంగా ఫొటోగ్రఫీనే ఆశగా, శ్వాసగా మారింది. క్రమంగా అతడికి ప్రకృతి సంబంధిత చిత్రాలు, అరుదుగా కనిపించే లొకేషన్లు, ప్రత్యేకతను సంతరించుకున్న చిత్రాలను సేకరించి భద్రపరుచుకోవడం అలవాటుగా మారింది. ఎక్కడ ఏ సన్నివేశాన్ని అయినా కెమెరాలో బంధించడం తనకు అలవాటుగా మారింది. సాధారణ చిత్రాలను సైతం విభిన్న కోణంలో తీసి తన సృజనాత్మకతను ప్రదర్శిస్తున్నాడు.




నిక్షేప్ తన కెమెరాలో బంధించిన చిత్రాలు


శ్రీనివాస్ తీసిన నిర్మల్ ఖిల్లా దృశ్యరూపం

లిఫ్ట్ ఇచ్చి.. కత్తితో బెదిరించి

- ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ శ్రీను

భైంసా: ఓ వ్యక్తిని కత్తితో బెదిరించి అతడి వద్ద ఉన్న నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను దొంగలించిన ఇద్దరు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ శ్రీను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 14న గుంటూరు జిల్లా పడిగురాళ్లకు చెందిన పూర్ణయ్య వ్యాపారం నిమిత్తం భైంసాకు వచ్చాడు. రాత్రి భోజనం చేసి 9.15గంటలకు ఆటో కోసం వేచిచూస్తున్నాడు. ఆ సమయంలో భైంసా పట్టణంలోని ఓవైసీనగర్‌కు చెందిన సల్మాన్ ఖాన్, సయ్యద్ అవేస అనే ఇద్దరు యువకులు బైక్‌పై అతడిని ఎక్కించుకుని శివారు ప్రాంతానికి తీసుకువెళ్లారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలో బైక్ ఆపి కత్తితో బెదిరించి అతడి వద్ద ఉన్న నగదుతో పాటు సెల్‌ఫోన్ లాక్కుని కొట్టి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఎస్సై పూర్ణేశ్వర్ శుక్రవారం నాందేడ్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొబైల్‌తో పాటు స్పెండర్ ప్లస్ బైక్‌ను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

న్యాయం కోసం అత్తింటి ఎదుట ధర్నా


ఇంటి ఎదుట బైఠాయించిన అనసూయ

కుంటాల: తనకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని ఓలా గ్రామానికి చెందిన అనసూయ అత్తింటి ఎదుట శుక్రవారం ధర్నాకు దిగింది. మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన అనసూయకు 16ఏళ్ల క్రితం ఓలా గ్రామానికి చెందిన సాయన్నతో వివాహమైంది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. అయితే కుటుంబ కలహాలతో ఇద్దరు 12ఏళ్ల క్రితం విడిపోయారు. అనసూయ పిల్లలను పోషించుకుంటూ నిర్మల్‌లో జీవనం సాగిస్తోంది. అనసూయ మూడు రోజుల క్రితం ఓలా గ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఇల్లు అమ్మేశామని, ఇక్కడ నీకేమీ లేదని చెప్పడంతో న్యాయం చేయాలని కోరుతూ ధర్నాకు దిగింది. గతంలో తనకు కేటాయించిన ఇల్లు ఇవ్వాలని వేడుకొంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ కనీస్ ఫాతిమా అక్కడకు చేరుకొని న్యాయం చేస్తానని హామీ ఇచ్చింది. శుక్రవారం ఎస్సై హన్మాండ్లు ఓలాకు చేరుకొని కుటుంబంలో ఏమైనా సమస్యలు ఉంటే చర్చించుకోవాలని ఇలా ధర్నాకు దిగవద్దని సూచించారు. ఇరువర్గాలతో మాట్లాడి న్యాయం చేస్తామని భరోసానివ్వడంతో ఆమె శాంతించింది.

కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు


దరఖాస్తు చేస్తున్న రాజేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్

నిర్మల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఆశించేవాళ్లు ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలని ఏఐసీసీ సూచించింది. ఈమేరకు నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థిత్వం కోసం సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్ దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు శుక్రవారం గాంధీభవన్‌లో తమ దరఖాస్తులను అందించారు. దీనిపై పత్తిరెడ్డిని సంప్రదించగా పార్టీ ముందస్తుగా ఎవరికీ టికెట్లు ప్రకటించదని, పీసీసీ అధ్యక్షుడినైనా తానూ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని రేవంత్‌రెడ్డి ప్రకటించారని చెప్పారు. ఈక్రమంలోనే దరఖాస్తు చేశామని చెప్పారు. పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని హంపోలి గ్రామానికి చెందిన బుజేకర్ శ్రీను (28) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... శ్రీను ఎలాంటి పనిచేయకుండా ప్రతి రోజు మద్యం తాగి భార్యతో గొడవపడేవాడు. మూడు నెలల భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మరింతగా తాగుడికి బానిసై జీవితంపై విరక్తితో మద్యం మత్తులో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం... ఉట్నూర్ మండలం పాటగూడకు చెందిన కుర్సెంగ లక్ష్మీదేవురావుకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు కుర్సెంగ ప్రకాశ్ (35) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం మద్యం మత్తులో పంట చేనుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇంటికి చేరుకుని విషయం చెప్పడంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు సంతానం ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్ వద్ద శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొట్టి గ్రామానికి చెందిన నితిన్, కామాయిపేటకు చెందిన జంగులు బైక్‌లపై వస్తుండగా వాహనాలు అదుపు తప్పి ఎదురురెదుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నితిన్ తీవ్రంగా గాయపడగా స్థానికులు 108లో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.